క్లుప్తంగా

కృష్ణానదీ జలాల సరఫరాకు చర్యలు తీసుకోవాలి



తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలోని గిరిజన తండాలు అధికంగా ఉన్న ఏ.కొండూరు మండలంలో రూ.49 కోట్లతో చేపట్టనున్న కృష్ణా నదీ జలాల సరఫరా ప్రాజెక్టుకు సత్వరం టెండర్లు పిలిచేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రక్షణనిధి విజయవాడ గ్రామీణ నీటిసరఫరా విభాగ ఎస్‌ఈ డి.వెంకటరమణను కోరారు. విజయవాడలో గురువారం ఎస్‌ఈని కలిసిన ఎమ్మెల్యే తండాల్లో శుద్ధి చేసిన నీటిసరఫరా ఆవశ్యకతను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కిడ్నీ బాధితులకు కృష్ణా నదీ జలాలను అందించే దిశగా ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నందున త్వరితగతిన పనులు చేపట్టాలని కోరారు.

నేడు మల్లేలలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

తిరువూరురూరల్: తిరువూరు మండలంలోని మల్లేల గ్రామంలో శుక్ర, శని వారాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శీలం నాగనర్సిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రక్షణనిధి పాల్గొని ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తారన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపింగ్ కౌంటర్ ప్రారంభం



మైలవరం: మైలవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపింగ్ కౌంటర్ ప్రారంభించినట్లు సబ్ రిజిస్ట్రార్ జగన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇకపై రిజిస్ట్రేషన్లకు ఫిజికల్ స్టాంపులు అవసరం లేదని ప్రజలంతా ఈ స్టాంపింగ్ ఉపయోగించుకోవాలన్నారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ప్రభుత్వం వారి కౌంటర్ ఏర్పాటు చేశామని, ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సబ్ రిజిస్ట్రార్ కోరారు.

విద్యతోనే గిరిజనుల అభివృద్ధి

మైలవరం: విద్యతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. మండల పరిధిలోని వెదురుబీడెం, కనిమెర్ల, పోరాటనగర్ తండాల్లో శంకర్ నాయక్ గురువారం పర్యటించారు. గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కనిమెర్ల తండాలో ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులతో కొద్ది సేపు ముచ్చటించి, పాఠ్యాంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని రుచి చూసి, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రతి గిరిజన లబ్ధిదారునికి చేరువయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రహదారులు, ఇంటింటికీ కుళాయిలు, మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఎం.రుక్మాందయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, సర్పంచ్‌లు మోహన్ నాయక్, సాంబశివరావు, ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి, ఎంపీడీఓ లక్ష్మీకుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుహాసిని, ఎఫ్‌ఆర్వో రాధాకుమారి, పంచాయతీరాజ్ ఏఈ రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ప్రసాద్, ఏఈ ఆర్ నవీన్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్.నరేష్, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థుల ఎంపిక

మైలవరం: మైలవరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నంబర్-1లో చదువుతున్న విద్యార్థి బోయపల్లి హరికుమార్ నవోదయ పాఠశాలకు నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీ వీరారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లమందల గ్రామం, ఏ.కొండూరు మండలానికి చెందిన హరికుమార్ ఎంపీపీ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. అదే విధంగా స్థానిక శ్రీలీలావతి పాఠశాల విద్యార్థిని పి.నిఖిల్ జవహర్ నవోదయ విద్యాలయం, వేలేరులో 2023-24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి సీటు సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం ఉడతా లక్ష్మీనారాయణ తెలిపారు. విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఆలయ స్థలశుద్ధి

నూజివీడు: ఆగిరిపల్లిలోని కనకదుర్గ ఆలయంలో గురువారం శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ చైర్మన్ పొన్నం వెంకట లక్ష్మణరావు సహకారంతో స్థల శుద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మచ్చా హరిబాబు, మాజీ ఎంపీటీసీ నక్కనబోయిన శ్రీమన్నారాయణ, టీడీపీ నాయకులు చౌటపల్లి విక్టర్‌బాబు, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ వాకా సక్కేశ్వరరావు, ఎంపీటీసీలు షేక్ నాగుల్‌మీరా, సాదం గోపీనాథ్, చిమటా శ్రీనివాసరావు, తవ్వా మురళి పాల్గొన్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్
- రాయనపాడులో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం



రాయనపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

రాయనపాడు(విజయవాడరూరల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తూ సువర్ణాధ్యాయం లిఖించారని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్ ద్వారా ప్రజలకు ఉచితంగా విస్తృతమైన వైద్య సేవలందిస్తున్నామన్నారు. రాయనపాడు గ్రామంలో 24 లక్షల రూపాయలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ నూతన భవనాన్ని ఎమ్మెల్యే వసంత, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ కె.సువర్ణరాజు, సర్పంచ్ కాటంనేని కళ్యాణితో కలిసి గురువారం ప్రారంభించారు.

నాణ్యమైన వైద్య సేవలు

ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా డాక్టర్లు ప్రతి విలేజ్ హెల్త్ క్లినిక్‌ను నెలలో రెండు దఫాలు ప్రజలకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్య సేవలందిస్తారన్నారు. మంచంలోని రోగులతో పాటు, అంగన్‌వాడీ, ఎలిమెంటరీ స్కూల్స్‌నూ సందర్శించి వైద్య సేవలందిస్తున్నారని చెప్పారు. విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ అందుబాటులో ఉంటారన్నారు. గ్రామాల్లోనే 14 రకాల పరీక్షలు చేస్తారన్నారు. గర్భం నిర్ధారణకు యూరిన్ టెస్ట్, హిమోగ్లోబిన్, ర్యాండమ్ గ్లూకోజ్, మలేరియా, హెచ్‌ఐవీ, డెంగీ, మల్టీపారా యూరిన్, అయోడిన్, వాటర్, హెపటైటిస్ బి నిర్ధారణ, ఫైలేరియాసిస్, సిఫ్లస్ ర్యాపిడ్, విజువల్ ఇన్స్పెక్షన్, స్పుటమ్ పరీక్షలు చేస్తారని చెప్పారు. టీబీ, లెప్రసీ, థైరాయిడ్ సహా పలు వ్యాధుల చికిత్సల కోసం 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. రాయనపాడు గ్రామాభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ తన సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఉప ఎంపీపీ వి.సురేష్, వైఎస్సార్ సీపీ మండల నాయకులు కాటంనేని పూర్ణచంద్రరావు, ఎంపీటీసీ అంగిరేకుల రమాదేవి, అధికారులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత, ప్రజాప్రతినిధులు

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సచివాలయ కన్వీనర్ల కో ఆర్డినేటర్ లంకె అంకమోహనరావు తెలిపారు. ఇబ్రహీంపట్నం కొండపల్లి పరిధిలో 1, 3 గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష పథకంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అర్హులైన లబ్ధిదారులకు అందజేయటమే పథక ముఖ్య ఉద్దేశమన్నారు. ఇంటింటి కార్యక్రమం విజయవంతం చేయటం ద్వారా వచ్చే నెల 1వ తేదీ నుంచి లబ్ధిదారులకు అవసరమైన పత్రాలు, గ్రామ సచివాలయాల్లోనే అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మునగాల శివారెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు నల్లమోతు ప్రసన్నబోస్, నాయకులు నల్లమోతు దయాకర్, ప్రకాష్, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు జగనన్న సురక్ష పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్ తెలిపారు. మండల ప్రత్యేకాధికారి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని అవగాహన కల్పిస్తారన్నారు.

తిరువూరురూరల్: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు సహకరించాలని తిరువూరు జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి కోరారు. కోకిలంపాడు, చౌటపల్లి గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో జగనన్న సురక్ష కార్యక్రమంపై గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందిన కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. సర్పంచులు మాధవి, రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు గుడిపూడి నారాయణరావు, గొర్ల నర్సిరెడ్డి, ఏసురత్నం, పంచాయతీ కార్యదర్శి ఫణిగోపాల్ పాల్గొన్నారు.

చాట్రాయి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతానికి అధికారులు సిద్ధంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి ఎన్‌డీ మిల్టన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ వలంటీర్ పరిధిలోని 50 గృహాలను సందర్శించి, వారి సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. జూలై 4 నుంచి మండలంలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఎంపీడీవో దుర్గా ప్రసాద్, తహసీల్దార్ విశ్వనాథరావు, ఈవో పీఆర్డీ నాగరాజు, ఏపీఎం అశోక్ పాల్గొన్నారు.



చాట్రాయిలో మాట్లాడుతున్న ఎంపీడీవో దుర్గా ప్రసాద్



చౌటపల్లిలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి

'జగనన్న సురక్ష'పై శ్రద్ధ పెట్టాలి

ముసునూరు: మండల వ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమ సర్వేపై శ్రద్ధ వహించాలని జగనన్న సురక్ష మండల ప్రత్యేకాధికారి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమంపై గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ పథకం సర్వే సక్రమంగా, సమగ్రంగా నిర్వహించాలన్నారు. సర్వే నిర్వహణపై అధికారులకు, సూపర్‌వైజర్లకు, వలంటీర్లకు అవసరమైన సూచనలిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ దాసరి సుధ, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, ఏఈలు నరసింహారావు, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లదే కీలకపాత్ర అని ఆగిరిపల్లి మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీవో వెంకటరత్నం అన్నారు. ఆగిరిపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో పథకంపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికి వెళ్లి అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు ఏమైనా రాకపోతే సమస్యను పరిష్కరించి పథకాలు వచ్చేలా చూడాలని డీఎల్‌డీఓ చెప్పారు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను, ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీవో పి.శంకర్‌రావు, తహసీల్దార్ ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగులో మెలకువలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మోనీషా

రెడ్డిగూడెం: మండల పరిధిలోని కూనపరాజుపర్వ రైతు భరోసా కేంద్రం నందు ఖరీఫ్ సాగులో మెలకువలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా శిక్షణా కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకురాలు మోనీషా మాట్లాడుతూ.. వరిలో ఎంటీయూ 1061, బీపీటీ 5204 వంటి రకాలు సాగు చేయాలని సూచించారు. సేంద్రీయ వ్యవసాయం, సమగ్ర ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. అవసరమైన మోతాదులో మాత్రమే ఎరువులను వినియోగించాలని సూచించారు. వ్యవసాయాధికారి ఆర్.సురేష్ మాట్లాడుతూ.. సాగు చేస్తున్న కౌలు రైతు భూ యజమాని ఆమోదంతో గ్రామ రెవెన్యూ అధికారి వద్ద కౌలు కార్డు పొందవచ్చన్నారు. ఈ కార్డు పొందిన కౌలు రైతుకి పంటపై మాత్రమే హక్కు ఉంటుందని, భూమిపై ఎటువంటి హక్కు ఉండదని తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్క కౌలు రైతు కౌలు కార్డు తీసుకోవాలని, దీనికి భూ యజమానులు సహకరించాలన్నారు. ఈకార్డు పొందిన వారికి ఈ క్రాప్ పంట నమోదు, పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాతంగి వెంకటేశ్వరరావు, గ్రామ రెవెన్యూ అధికారి జయకృష్ణ, గ్రామ వ్యవసాయ సహాయకురాలు దివ్య, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

హోంగార్డులకు యూనిఫాం వితరణ



నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీకాంత్ సౌజన్యంతో నూజివీడు పట్టణ, రూరల్, సర్కిల్ ఆఫీస్, డీఎస్పీ ఆఫీస్ డ్రైవర్లుగా పనిచేస్తున్న హోంగార్డులకు, ట్రాఫిక్ సిబ్బందికి గురువారం నూజివీడు డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ గౌడ్ చేతుల మీదుగా యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బందికి యూనిఫాం అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నూజివీడు టౌన్ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, ట్రాఫిక్ ఎస్ఐ శాగం రాధాకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం



ముసునూరు: విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు పూర్వ విద్యార్థులు సహకరించడం అభినందనీయమని హెచ్‌ఎం సునీల అన్నారు. మండల కేంద్రం ముసునూరులోని జెడ్పీ హైస్కూల్లో 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు రూ.10 వేలతో పాఠశాలకు కుర్చీలను బహూకరించారు. గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కుర్చీలను హెచ్‌ఎంకు అందజేశారు.

కౌలురైతులకు కార్డులు తప్పనిసరి



చెవుటూరులో కౌలురైతు కార్డును అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ

జి.కొండూరు: కౌలురైతు కార్డులతో ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలు నేరుగా కౌలుదారులకే అందుతాయని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. చెవుటూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో కౌలురైతు కార్డులను అందజేసేందుకు గ్రామసభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ స్థానిక సర్పంచ్ పిన్నిబోయిన శ్రీదేవి, వైస్ ఎంపీపీ పుప్పాల సుబ్బారావుతో కలిసి లబ్ధిదారులకు కౌలురైతు కార్డులను అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. పరిమిత కాలంతో ఇచ్చే ఈ కార్డుల వల్ల భూ యజమానులకు ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. కౌలుదారులు ప్రతి ఒక్కరూ ఈ కార్డులను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ రాంకుమార్, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పశు బీమాతో ప్రయోజనాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, పాడి రైతులు

ముసునూరు: వైఎస్సార్ పశు బీమా పథకంతో పోషకులకు అధిక ప్రయోజనాలు కలుగుతాయని పశుసంవర్ధక శాఖ నూజివీడు ఏడీ టీఆర్కే ప్రసాద్ అన్నారు. పశువైద్యాధికారి ఎం.వెంకట చైతన్య అధ్యక్షతన మండలంలోని అక్కిరెడ్డిగూడెంలో నిర్వహించిన వైఎస్సార్ పశు బీమా పథకంపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పశు బీమా పథకం వివరాల వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పుచ్చకాయల వెంకటేశ్వరరావు, సర్పంచ్ పులిబక్ల లక్ష్మీ సత్యనారాయణ, పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.

ఏపీఎస్‌సీహెచ్‌ఈ అవార్డు గ్రహీతకు అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

మైలవరం: తమ కళాశాల విద్యార్థిని క్యానమ్ సాయి వెంకట సుప్రజ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఫర్ హయర్ ఎడ్యుకేషన్(ఏపీఎస్‌సీహెచ్‌ఈ) ప్రకటించిన బెస్ట్ స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్ అవార్డుకు ఎంపికై ద్వితీయ స్థానంలో నిలిచారని మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. అవార్డు పొందిన విద్యార్థినిని కళాశాల అధ్యక్షుడు జీ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ఈసీఈ ఇన్‌చార్జి విభాగాధిపతి డాక్టర్ జీ శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి.శివహరిప్రసాద్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అప్పారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పాల్గొన్న విద్యార్థుల్లో చివరి రౌండ్‌కు 12 మంది బెస్ట్ స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్ అవార్డుకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారిలో తమ కళాశాలకు చెందిన విద్యార్థిని సాయి వెంకట సుప్రజ ఎంపిక కావడం కళాశాల ప్రతిష్టను పెంచిందన్నారు. ఈ నెల 20న విజయవాడ ఏ కన్వెన్షన్ హాల్‌లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఏపీఎస్‌సీహెచ్‌ఈ చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమాచంద్రారెడ్డిల ద్వారా రూ.75 వేల నగదు, సర్టిఫికెట్, షీల్డ్ అందుకున్నట్లు తెలిపారు.

డిగ్రీ ఆనర్స్ కోర్సులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వికాస్ విద్యాసంస్థల చైర్మన్ నర్సిరెడ్డి

విస్సన్నపేట: నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ 2023 ప్రకారం ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ ఆనర్స్ కోర్సులు ప్రవేశ పెడుతున్నామని, ఈ కోర్సుల గురించి విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని వికాస్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్.నర్సిరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి, కృష్ణా విశ్వవిద్యాలయ ఆదేశాల మేరకు గురువారం స్థానిక వికాస్ కళాశాలలో ఆనర్స్ డిగ్రీ -సింగిల్ మేజర్ సబ్జెక్టులపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్‌గా ట్రిలాజిక్ సాఫ్ట్ సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ సిరిమళ్ల రవికుమార్ పాల్గొని మాట్లాడుతూ.. ఆనర్స్ డిగ్రీలో చేరే విద్యార్థులు తమ అభిరుచికి తగిన సబ్జెక్టులను ఎంచుకోనే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆంగ్ల బాషా నైపుణ్యాలు మెరుగుపర్చుకోవడానికి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఉచితంగా అందిస్తున్న సెల్ఫ్ లెర్నింగ్ పోర్టల్ లాగిన్ అవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వికాస్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సీతారామరాజు, చాట్రాయి, రెడ్డిగూడెం డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎ.రామ్మోహనరెడ్డి, డి.శ్రీనివాసరావు, నున్న వికాస్ గ్రూప్స్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రామ్మోహనరావు పాల్గొన్నారు.

8 మంది జూదరుల అరెస్ట్

ముసునూరు: రెండు గ్రామాల్లో పేకాట శిబిరాలపై గురువారం సాయంత్రం వరుస దాడులు చేసి, ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు. చింతలవల్లి శివారు గోగులంపాడులో ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రూ.10,240, అక్కిరెడ్డిగూడెంలో ఇద్దరిని అరెస్ట్ చేసి, రూ.1,100 సీజ్ చేశామన్నారు. ఈ మేరకు కేసులు నమోదు చేశామని, నిందితులను నూజివీడు కోర్టుకు శుక్రవారం తరలిస్తామని ఎస్ఐ చెప్పారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓ-2

ముసునూరు: ఎంఈవో - 2గా బీఎస్ సుబ్బారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. నూజివీడు మండలం దేవరగుంట హైస్కూల్ హెచ్‌ఎంగా ఇటీవల నియమితులైన ఆయన ఉద్యోగోన్నతిపై ముసునూరు మండల ఎంఈఓ - 2గా గురువారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనను మండలంలోని ఉపాధ్యాయ సంఘాల నేతలు, అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు



ఆగిరిపల్లిలో ఆక్రమణలను తొలగించాలని సూచిస్తున్న ఎస్ఐ చంటిబాబు, సిబ్బంది

నూజివీడు: ఆగిరిపల్లిలో రహదారి మార్జిన్‌లను ఆక్రమించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నంబూరి చంటిబాబు హెచ్చరించారు. స్థానిక ప్రధాన రహదారుల్లో గురువారం ఆయన తన సిబ్బందితో కలిసి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ప్రజలు శాంతిభద్రతల నెలకొల్పేందుకు, ట్రాఫిక్ ఇబ్బందులు ఎదరవ్వకుండా ఉండేందుకు సహకరించాలని కోరారు. రోడ్డుపైకి వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలను పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు గమ్యస్థానానికి సురక్షితంగా చేరాలంటే తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలను కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జూలై 4న రంగా జయంతి వేడుకలు

మైలవరం: విజయవాడ తూర్పు నియోజకవర్గ మాజీ శాసన సభ్యుడు దివంగత వంగవీటి మోహనరంగా 76వ జయంతి వేడుకలు జూలై 4వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళా క్షేత్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు ఆకుల శ్రీనివాసకుమార్ తెలిపారు. మైలవరంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కఠారి ఉమామహేశ్వరరావు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆకుల శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ.. మోహన రంగా బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎనలేని సేవలు చేశారన్నారు. వారి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. రంగా ఆశయాలకు అనుగుణంగా తాము పనిచేస్తున్నట్లు తెలిపారు. రంగా జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆయనకు అత్యంత సన్నిహితులకు, వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారిని ఘనంగా సన్మానిస్తామని తెలిపారు. కుల, మతాలకు అతీతంగా అందరూ కలిసి రావాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కఠారి ఉమామహేశ్వరరావు, నాయకులు పూర్ణ, బొమ్ము రాము, మురళి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ గ్రామం మీరా కాలనీ నివాసితులు అభ్యర్థన మేరకు విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు స్థానిక ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న గురువారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా కాలనీ వాసులు విద్యుత్ సౌకర్యం లేక రాత్రి సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యను ఇటీవల తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. రోజుల వ్యవధిలో సమస్యను పరిష్కరిస్తానని వారికి ఇచ్చిన హామీ మేరకు ఈ రోజు కరెంట్ స్తంభాల ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టామన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాలడుగు దుర్గాప్రసాద్, కేతనకొండ గ్రామ సర్పంచ్ నళిని ఆశాలత, సెగ్మెంట్-1 ఎంపీటీసీ కొమ్మూరు రామకోటేశ్వరరావు, సెగ్మెంట్-2 పులి స్వర్ణరాజు, ఇబ్రహింపట్నం మండలం కో ఆప్షన్ మెంబర్ పఠాన్ నాగుల్ మీరా, సెక్రటరీ సరోజ భాయ్, మాధవి, ఎ.నాగేశ్వరరావు, సయ్యద్ జానీ, బండి వెంకట్రావు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

తిరువూరు: పట్టణంలోని ప్రైవేట్ విత్తన డీలర్ల గోదాములను వ్యవసాయాధికారి పద్మ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టాకు రిజిస్టర్లను పరిశీలించి నిబంధనల కనుగుణంగా మాత్రమే విత్తనాలు విక్రయించాలని డీలర్లను ఆదేశించారు. గరిష్ఠ చిల్లర ధరకు మించి విత్తనాలను అమ్మినా, నాసిరకం విత్తనాలు విక్రయించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. విత్తనాల కొనుగోలుకు వచ్చిన రైతులను డీలర్లు విక్రయించే ధర్మపై ఆరా తీశారు. ప్రతి రైతుకు విధిగా రశీదు ఇవ్వాలని డీలర్లకు సూచించారు.

చలివేంద్రంలో మజ్జిగ, స్వీట్ పంపిణీ

వెల్వడం(మైలవరం): మైలవరం మండలం వెల్వడం గ్రామ కచేరి చావడి వద్ద శ్రీమతి లకిరెడ్డి పాపులమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1987-1992 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రం వద్ద గురువారం మజ్జిగ, స్వీట్ పంపిణీ చేశారు. శ్రీషిరిడీ సాయినాథ్ మహరాజ్ ఆశీస్సులతో బొల్లా విజయకృష్ణ, సుధీర్‌రెడ్డి దంపతులు(యూఎస్‌ఏ) వితరణతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం నాయకుడు గూడూరు నాగిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకటన
[illegible]
చింతల వెంకటరెడ్డి, అడ్వకేట్
తిరువూరు 0.22-06-2023

ప్రకటన
[illegible]
చింతల వెంకటరెడ్డి, అడ్వకేట్
తిరువూరు 0.22-06-2023

ప్రకటన
[illegible]
చింతల వెంకటరెడ్డి, అడ్వకేట్
తిరువూరు 0.22-06-2023

ప్రకటన
[illegible]
చింతల వెంకటరెడ్డి, అడ్వకేట్
తిరువూరు 0.22-06-2023

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com